క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో సమావేశమైన మండల ప్రత్యేకాధికారి కొండలరావు

జియ్యమ్మవలస: మండలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మండల ప్రత్యేకాధికారి కె.కొండలరావు మండల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల చెల్లింపులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.యోగాంధ్ర కార్యక్రమంపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో పైనాపిల్ విక్రయాలు

సీతంపేట: గిరిజనులు పండించే పైనాపిల్‌ను రైతుబజార్లలో విక్రయించుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు మన్యం జిల్లాలోని రైతుబజార్లలో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు అనుమతుల కోసం ఐటీడీఏ ఉద్యానవన శాఖను సంప్రదించాలన్నారు.

ఫారం పాండ్స్ పనులు పూర్తి చేయాలి

సీతంపేట: ఈ నెలాఖరులోగా ఫారంపాండ్స్ పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీతంపేట, భామిని ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. పనులకు సంబంధించిన అంచనాలు శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీబీ మిశ్రో, ఏపీడీ శ్రీహరి, ఏపీఓ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



భామిని: మండలంలోని బత్తిలి పోలీస్ స్టేషన్‌లో కొత్త ఎస్సైగా జి.అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అప్పారావు ఇంతవరకు క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏఎస్సై కొండగొర్రి కాంతారావు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన అనిల్‌కుమార్‌కు సాలూరు బదిలీ జరిగింది.


సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి రవికుమార్

పాలకొండ రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది, ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల జ్వరాలు, దోమల కారణంగా ఏర్పడే ఇబ్బందులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వేతన ఒప్పందం జరగాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు


పాలకొండ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం జరగాలని కోటదుర్గా మార్కెట్ కలాసీ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక మార్కెట్ ఆవరణలో కలాసీ యూనియన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. పాలకొండలో సిమెంట్, ఐరన్, కూరగాయలు, కిరాణా, తదితర హోల్‌సేల్ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త వేతన ఒప్పందం అమలు చేయాలని కోరారు. 2019లో చేసుకున్న ఒప్పందం 2022తో పూర్తయిందని.. యాజమాన్యాలు సానుకూలంగా స్పందించి సహకరించాలని కోరారు. సమావేశంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

● జీవ రసాయనాలతో

పంటలకు జీవం

- సేంద్రియ వ్యవసాయంలో బయోఫెస్టిసైడ్స్‌ది కీలక పాత్ర
- జీవ శిలీంద్ర నాశిని మందులతో భూమి ద్వారా వ్యాపించే శిలీంద్రపు తెగుళ్లకు చెక్
- ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్, క్లోరోసెన్స్ వంటి జీవ శిలీంద్ర నాశిని మందులను

వాడాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు



ట్రైకోడెర్మా విరిడీ బయోఫెస్టిసైడ్

గరుగుబిల్లి: జీవ రసాయన మందులు (బయోఫెస్టిసైడ్స్) పంటలకు జీవం పోస్తాయని, పంటల దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఆర్.విజయభారతి అంటున్నారు. తక్కువ ధరకే లభించే ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్, క్లోరోసెన్స్ వంటి బయోఫెస్టిసైడ్స్‌ను వ్యవసాయ, ఉద్యానవన, కూరగాయల పంటల సాగులో వినియోగిస్తే బహుళ ప్రయోజ నాలు ఉంటాయని చెబుతున్నారు. విత్తనశుద్ధి, వివిధ రకాల తెగుళ్ల, పురుగుల నివారణలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయని, వీటి వినియోగంపై రైతులు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ అధికారి వివరించారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం

పంటల సాగులో పురుగులు, తెగుళ్ల నివారణలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు విచక్షణా రహితంగా రసాయన మందులను పిచికారీ చేస్తుండడంతో పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు భూమిలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. సాగు ఖర్చులు తగ్గించుకునే క్రమంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరించాలి. అందులో భాగంగా బయోఫెస్టిసైడ్స్ (జీవ క్రిమిసంహారక మందులు) చాలా ఉన్నాయి. ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్, క్లోరోసెన్స్ అనే జీవక్రిమి సంహారక మందులు వ్యవసాయ శాఖ జీవ నియంత్రణ ప్రయోగశాలలో తయారవుతున్నాయి. వివిధ రకాల పంటలను ఆశించే కాయకుళ్లు, మొదలు కుళ్లు, మాగుడు తెగుళ్ల, వేరుకుళ్లు, కాండం కుళ్లు, ఎండు తెగుళ్లను ట్రైకోడెర్మా విరిడీతో నియంత్రించవచ్చు. వేరుశనగ విత్తనాలను ట్రైకోడెర్మావిరిడీతో శుద్ధి చేయడం ద్వారా పంటను ఎండు తెగులు ఆశించకుండా సమర్థవంతంగా పనిచేస్తుంది. అలాగే మిరపలో వేరుకుళ్లు, టమాటాలో కాండం కుళ్లు, పుచ్చ చేనులో వేరుకుళ్లను నివారించడంలో ఇది మంచి ఫలితాలను ఇస్తుంది.

విత్తన శుద్ధి..

ఏ పంట వేసినా ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కిలో విత్తనాలకు 10 గ్రాములు ట్రైకోడెర్మ విరిడీ మందును కలిపి విత్తన శుద్ధిచేశాక నాటుకుంటే పంటను చాలా వరకు తెగుళ్లు ఆశించవు. అలాగే పొలంలో పశువుల ఎరువుతో కూడా దీనిని చల్లవచ్చు. వంద కిలోల పశువుల ఎరువులో పది కిలోల వేప పిండి, నాలుగు కిలోల ట్రైకోడెర్మా విరిడీ మందును కలిపి నీళ్ల చిలకరిం చి కుప్పగా పోసి గోనె సంచితో కప్పి నీడలో వారం రోజుల పాటు ఉంచాలి. తెల్లటి బూజు కనిపించిన వెంటనే పొలంలో చల్లుకోవాలి. దీన్నే వృద్ధి చేసిన ట్రైకోడెర్మావిరిడీ అంటారు.

బహుళ ప్రయోజనాలు...

ట్రైకోడెర్మావిరిడీ విత్తనం నుంచి, భూమినుంచి సంక్రమించే శిలీంద్రకారక తెగుళ్లను నివారిస్తుంది. పచ్చిరొట్ట, వేప తదితర సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ట్రైకోడెర్మావిరిడీ భూమిలో అతి వేగంగా అభివృద్ధి చెంది ఎక్కువ కాలం నేలలో ఉంటుంది. పంటల పెరుగుదలకు, అధిక దిగుబడులకు దోహదపడుతుంది. తెగుళ్లను కలిగించే శిలీంద్రాలపై పోరాడుతూ వాటిని చంపి పంటలను ఆశించే పురుగులను అరికడుతుంది. ఆమ్లత్వం ఉన్న నేలల్లో, సేంద్రియ ఎరువులు విరివిగా వాడుతున్న నేలల్లో భూమిలో తేమ ఉన్నప్పుడు ట్రైకోడెర్మావిరిడీ వేరు కుళ్లు తెగుళ్లను అదుపులో ఉంచుతుంది. ట్రైకోడెర్మావిరిడీ మందును వ్యవసాయ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

చిట్టిపులివలసలో స్వచ్ఛభారత్



విద్యార్థులతో కలిసి పిచ్చి మొక్కలు తీస్తున్న రాంబాబు మాస్టారు

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇదేంటి పాఠశాలలకు వేసవి సెలవు కదా.. విద్యార్థులు ఉండడమేంటి అనుకుంటున్నారా... అయితే ఈ వివరాలు చదవండి...సాకేటి రాంబాబు మాస్టార్ ఏ స్కూల్‌లో పనిచేసినా దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులతో గడుపుతుంటారు. సామాజిక సేవా కార్యక్రమాలు, వేసవి శిక్షణ శిబిరాలు వంటివి నిర్వహిస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తుంటారు. చిట్టిపులివలస ప్రాథమిక పాఠశాలలో కూడా ప్రస్తుతం వేసవిలో ప్రత్యేక తరగతులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులతో మమేకవుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

నేడు యోగా శిక్షణ తరగతులు



అధికారులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్

గరుగుబిల్లి: యోగాంధ్రలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యోగా శిక్షణ తరగతులకు ఉపాధిహామీ పథకంలో మేట్‌లు, గ్రామైక్య సంఘాల సభ్యులు, ఇతర కార్యాలయాల సిబ్బంది హాజరయ్యేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో రోగులకు సేవల్లో అంతరాయం లేకుండా సిబ్బంది ఉదయం, మధ్యాహ్నం యోగా శిక్షణలో పాల్గొనాలని తెలిపారు. కోవిడ్‌పై ప్రజలను అప్రమత్తం చేసి విందు, వినోదాలను వాయిదా వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల, స్థానిక వైద్యాధికారి సంతోష్‌కుమార్, ఉపాధిహామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పార్క్ సుందరీకరణకు ప్రతిపాదనలు చేయండి



పార్క్ సుందరీకరణపై అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

గరుగుబిల్లి: తోటపల్లి భారీ నీటిపారుదల ప్రాజెక్టు కుడి మట్టికట్ట వద్ద గల ఐటీడీఏ పార్క్ సుందరీకరణకు అవసరమైన ప్రతిపాద నలు సిద్ధం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పార్క్ దగ్గర షాపుల నిర్మాణాన్ని, పార్క్‌లో సదుపాయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సందర్శకులను ఆకట్టుకునేలా పార్క్‌లో సౌకర్యాలు కల్పించాలని, షాపుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పీఓ వెంట ఐటీడీఏ ఏఈ జి.తిరుపతిరావు, పార్క్ సిబ్బంది ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మర్రాపు శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అనంతరం వివాహ వేడుకకు వచ్చిన పార్టీ కార్యకర్తలను పలకరించి, వారితో ముచ్చటించారు. పరీక్షిత్‌రాజు వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు,ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బి.వెంకట దామోదర్, నాయకులు డి.మాధవ నాయుడు, సీహెచ్. వెంకటేశ్వరరావు, జి.చంద్రశేఖర్, టి.సింహాచలం, తదితరులు ఉన్నారు.

వట్టిగెడ్డలో నీటి ప్రవాహం



వట్టిగెడ్డలో ప్రవహిస్తున్న నీరు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షంతో వరదనీరు స్థానిక వట్టిగెడ్డకు పోటెత్తడంతో గెడ్డలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. మూడు నెలలుగా చుక్కనీరు లేక వెలవెలబోయిన వట్టిగెడ్డకు ఒక్కసారిగా జలకళ వచ్చింది. గెడ్డలో నీటి ప్రవాహం పెరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యం, చట్టాలపై అవగాహన



కొంకడివరంలో ర్యాలీ చేస్తున్న బాలికలు, ఐసీడీఎస్ సిబ్బంది

గరుగుబిల్లి: కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా కొంకడివరం గ్రామంలో బాలికలు, మహిళలకు ఆరోగ్యం, రక్షణ చట్టాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తోందన్నారు. గ్రామాల్లో బడికి వెళ్తూ మధ్యలో మానేసిన పిల్లలను పాఠశాలల్లో తిరిగి చేర్పించాలని తల్లులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది బి.చిన్నమ్మి, సిహెచ్. ఉదయకుమారి అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. పోక్సో, బాల్యవివాహాల నిషేధ, తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం ఐసీడీఎస్, వైద్య సిబ్బందితో ర్యాలీ చేశారు.

ఈ గోతులను పూడ్చరా..



గుంతలతో నిండిన ఏబీ రోడ్డు

భామిని: మండల కేంద్రంలోని ఏబీ రోడ్డులో ఏర్పడితన గోతులతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామన్న కూటమి నాయకులకు ఏబీ రోడ్డు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ రత్నం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీకి నీటి సరఫరా జరిగే పంపింగ్ సిస్టమ్ పాడవ్వడంతో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారని, శనివారం సాయంత్రం లోగా నీటి సరఫరా చేపడతామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



తోటగూడలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కురుపాం మండలంలోని నేరేడువలస, తోటగూడ గ్రామాల్లో పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఆలస్యానికి గల కారణాలపై లబ్ధిదారు లను ఆరా తీశారు. దశల వారీగా లబ్ధిదారులకు బిల్లుల చెల్లించాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, తదితరులున్నారు.

సారా రహిత గ్రామాలుగా గుర్తింపు



రేగిడి గ్రామస్తులతో సీఐ శ్రీనివాసరావు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి, టిక్కబాయి, పులిగూడ గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించినట్లు కురుపాం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాస రావు తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సారాతో కలిగే అనర్థాలపై నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఈగ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు గతంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన వారిపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేశామన్నారు.దీంతో గత మూడు నెలలుగా ఈ గ్రామాల్లో ఎవ్వరూ సారా తయారు చేయడం కానీ, విక్రయించడం కానీ చేయలేదని, ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదులు కూడా అందలేదన్నారు. అందుకే ఈ గ్రామాలను సారా లేని గ్రీన్ గ్రామాలుగా గుర్తిస్తున్నామని చెబుతూ, ఆయా గ్రామాల ప్రజలను అభినందించారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి, ఎస్‌ఐ రాజశేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే కళావతి



విశ్వాసరాయి కళావతి.

సీతంపేట: పేదలకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను రద్దు చేయడం అన్యాయమని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని కూటమి సర్కార్ రద్దు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. నెలలో 15 రోజులు ఎండీయూ వాహనాలు ఇంటింటికి వెళ్లి ఉదయాన్నే రేషన్ సరఫరా చేసేవన్నారు. కొండలపై ఉన్న గిరిజనులకు ఈ విధానం ఎంతో ఉపయోగపడేదని.. ఒకపై సరుకులు ఎవరు తీసుకెళ్లి ఇస్తారని ప్రశ్నించారు. కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ మైదాన ప్రాంతానికి వచ్చి సరుకులు తీసుకెళ్లాలా అని ప్రశ్నించారు. ఈ వాహనాలను నమ్ముకుని బతుకుతున్న నిర్వాహకుల పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం వారికి ప్రత్యామ్నా ఉపాధి మార్గాలు చూపాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

● మండల ప్రత్యేకాధికారి మన్మధరావు



అన్నవరంలో ప్రజలతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మన్మధరావు

పాలకొండ రూరల్: ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో ఫీల్డ్ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జె.డి డాక్టర్ శివ్వాల మన్మధరావు అన్నారు. మండలంలోని అన్నవరం, అంపిలి, గోపాలపురం పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాల పరితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ.. రానున్న ఎపిడమిక్ సీజన్‌లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, ప్రజా ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్నపాటి సమస్య గుర్తించినా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఎంపీడీఓ ఎం.విజయరంగారావు మండల పరిధిలో చేపడుతున్న ఉపాధి పనుల వివరాలను ఆయనకు వివరించారు. అలాగే పట్టణ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ప్రత్యేకాధికారి ప్రయాణికుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలపై డీఎం వెంకటేశ్వరరావుకు సూచనలు చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ చేయాలి



గిరిజనులతో మాట్లాడుతున్న వైద్యాధికారి భానుప్రతాప్

సీతంపేట: దోమల నివారణా మందును గృహాల్లో పిచికారీ చేయించుకోవాలని దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్ అన్నారు. మండలంలోని కిల్లాడ, రూపాయి గ్రామాల్లో ఏసీఎం ద్రావణం పిచికారీ చేస్తున్న తీరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో దోమల నివారణా మందు పిచికారీ చేయించుకోవడానికి ముందుకు రావాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ అమలుకు ఆదేశాలు..



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి రాజేష్

పాలకొండ రూరల్: ఉద్యోగ భద్రతకు సంబంధించి 1/2019 సర్క్యులర్ ఒక్కో డిపోలో ఒక్కోలా అమలయ్యేదని ఎన్‌ఎంయూ పాలకొండ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ అన్నారు. దీనివలన ఆర్టీసీ ఉద్యోగులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ యూనియన్ గడిచిన ఆరు నెలలుగా వివిధ రకాల పోరాటాలు, నిరసనల రూపంలో అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాల దృష్టికి సమస్య తీసుకువెళ్లిందన్నారు. ఈ నేపథ్యంలో సర్క్యులర్ 1/2019 యథావిధిగా అన్ని డిపోల్లో అమలు చేసేలా సంస్థ ఎం.డి నుంచి ఈడీ, డీపీటీఓలకు స్పష్టమైన ఆదేశాలు రావడం శుభ పరిణామమన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. సదరు సర్క్యులర్ విధివిధానాలపై చర్చించారు. సమావేశంలో యూనియన్ నాయకులు, సహ ఉద్యోగులు ఎం.వైకుంటరావు, ఎం.సుబ్బారావు, ఎంఆర్.మూర్తి, ఎం.రాంబాబు, పీవీ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇవేం రోడ్డు పనులండీ బాబూ..



కొత్తగా వేసిన విక్రమపురం - కంబర రోడ్డు దుస్థితి

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం జంక్షన్ సీఎస్పీ రోడ్డు నుంచి కంబర గ్రామం వరకు ఇటీవల కొత్తగా బీటీ రోడ్డు నిర్మించారు. అయితే కొత్తగా వేసిన రోడ్డుకు - సీఎస్పీ రోడ్డుకు మధ్యలో 10 అడుగుల వరకు రోడ్డు వేయకుండా ఖాళీగా వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ఖాళీ స్థలంలో నీరు చేరుతోంది.దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

● సామూహిక అర్చనలు



పాలకొండ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులు వైభంగా చేయిస్తున్నారు. ట్టణ పరిధిలోగల దక్షిణాముఖ ఆంజనేయ ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. అలాగే వడమ వీరాంజనేయ ఆలయంలో సామూహిక అర్చనలు, వ్రతాలు.. అంపిలిలో బిల్వార్చన కార్యక్రమాన్ని భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. - పాలకొండ రూరల్

● చేపల వేట..



కొమరాడ మండలంలో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నాగావళి నదిలోకి కొత్తనీరు చేరుతోంది. దీంతో తోటపల్లి రిజర్వాయర్‌లోని చేపలు నదీ ప్రవాహంలో కొట్టుకు వస్తుండడంతో కొమరాడ, కొట్టు, గుమడ, తదితర గ్రామాలు ప్రజలు చేపల పట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా ఏ ఇంటిలో చూసినా చేపల కూరే కావడం విశేషం. - కొమరాడ